
**కామెడీ కథ**

**అటల్ బిహారీ వాజ్‌పేయినీ, అద్వానీని ఎరుగని వారుంటే ఆశ్చర్యం లేదు కానీ మిస్టర్ పరబ్రహ్మానందమూర్తిని ఎరుగని వాళ్ళు మా ఊళ్ళో ఉండరని నా ప్రగాఢ నమ్మకం.**

# పాపం! పరబ్రహ్మానందమూర్తి





నా నమ్మకంతో మీరూ ఏకీభవించాలంటే మరి ఆయన కథ విని తరించాల్సిందే. పరబ్రహ్మానంద మూర్తి అంటే పండితోత్తముడో, పరమ పురాతనుడో అనుకునేరు కనుక అదేంకాదు. ఆయన నేను క్లర్కుగా పనిచేస్తున్న బ్యాంక్‌లో సాక్షాత్తూ బ్రాంచి మేనేజర్ కాబట్టి నాకు ప్రత్యక్షదైవమూ, వరాలు ఇచ్చే దేవుడూనూ.

పేరంటే సనాతనం కానీ మనిషి మాత్రం ఆధునికుడే. అహ్మదాబాద్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఎంబిఏ చదివి డైరెక్ట్‌గా మేనేజర్‌గా రిక్రూట్ అయినవాడు. వయసూ నలభై దాటడు. కళ్ళు మూసుకుని కస్టమర్ల పేర్లను వల్లెవేయగల జ్ఞాపకశక్తికి పెట్టింది పేరు. స్ట్రాంగ్ రూంలో ఎంత క్యాష్ ఉందో, ఏ లాకర్ ఎవరి పేరు మీద ఉందో నిద్రలో లేపినా చెప్పగల దిట్ట. అయితే ఇవేమీ ఆయనకంత పేరు తెచ్చి పెట్టలేదు కానీ ఒక్కటే ఆయన పేరు జనం నోళ్ళలో నానేలా చేసింది. అదే ఆయనకున్న వేపకాయంత వెర్రి.

మామూలుగా ఎవరి నమ్మకాలు వాళ్ళకుంటాయి. దాన్నెవరూ పట్టించుకోరు. కొంచెం శృతి మించితే మూఢనమ్మకం అంటాం. మరీ శృతిమించితే వెర్రి అంటాం. ఆ కోవకి చెందినదే మా మూర్తిగారి వాస్తు పిచ్చి. అదే ఆయనకి ఆ ఊళ్ళో గొప్ప (?) పేరు తెచ్చిపెట్టింది.

బ్యాంక్‌లో జాయినైన మొదటిరోజే మూర్తిగారు మాకు పార్టీ ఇస్తూ గోడవైపు ముఖం, మా వైపు వీపూ పెట్టి కూర్చున్నప్పుడు మేమంతా విషయం తెలీక కంగారుపడిన మాట నిజం. అయితే మొదటిరోజే మొహం ఉత్తరం వైపు పెట్టి కూర్చోవడం ఇష్టం లేక దక్షిణం వైపు పెట్టుకున్నాడన్న సంగతి గ్రహించలేకపోయాము.

అయితే ఆయన నమ్మకం దాచేస్తే దాగని సత్యంలా ఆ మర్నాడే మాకందరికీ తెలిసిపోయింది. అదెలాగంటే మేమంతా బ్యాంక్‌కి వచ్చేసరికి అయిదారుగురు మనుషులు గునపాలతో తలుపులన్నీ ఊడదీస్తున్నారు. మేమంతా హడావిడి పడుతూ పరుగెత్తేసరికి సదరు మేనేజర్ గారు అభయహస్తం ప్రదర్శించి మరీ సెలవిచ్చారు కదా-బ్యాంక్ పెట్టిన బిల్డింగ్‌కి వాస్తు బాగాలేదనీ అందుకే బిజినెస్ డెవలప్ అవ్వడం లేదని. తలుపులు మారిస్తే సెట్ అవుతుందని. ఆయన చేసిన మార్పులు, చేర్పులు వలన స్ట్రాంగ్‌రూం తలుపు పెరటివైపునకీ, కస్టమర్స్ క్యూ వీధి వైపునకు వెళ్ళిపోయినా ఆయనేం కంగారు పడలేదు.



**డి.వాణీప్రభ**

కానీ మేమంతా ముక్కున వేలేసుకుని ''ఔరా! ఇంత చదువుకున్న మనిషికి ఇదేం పిచ్చి! ఇదే కదా వేపకాయంత వెర్రంటే'' అని నిట్టూర్చాము. ఆ తరువాత తరచుగా నిట్టూర్చడం అలవాటయిపోయిందనుకోండి. అది వేరే సంగతి.

మూర్తిగారు సాక్షాత్తూ నా ప్రత్యక్షదైవం అన్నాను కదా అంటే నేను ఆయన క్రింద స్టెనో కమ్ టైపిస్టునన్నమాట. ఏ మాటకామాటే చెప్పుకోవాలి. పాపం నన్నెప్పుడూ ఫ్రెండ్‌లా ట్రీట్ చేసేవాడు. ఆ చనువుతోనే ఒకరోజు ఏమైతే అయిందిలెమ్మని ''మూర్తిగారూ! మీకీ నమ్మకం ఎలా ఏర్పడింద''ని ధైర్యం చేసి అడిగేసాను. రీలు వెనక్కి త్రిప్పితే-

పదేళ్ళక్రితం మూర్తిగారు మంచి ఫిజిక్‌తో గేమ్స్, జిమ్స్ గట్రా అటెండ్ అవుతున్నప్పుడు ఒకరోజు బాస్కెట్‌బాల్ ఆడుతుంటే నడుం పట్టేసింది. పట్టేసిన నడుంతో ముందుకీ, వెనక్కీ వంగలేక నానా అవస్థపడుతూనే పాపం మూర్తిగారు, అల్లోపతీ, హోమియోపతీ, అయుర్వేదంలాంటివన్నీ వాడేసి నడుంనొప్పి మాత్రం తగ్గక ''శ్రీపతీ! నీవే దిక్కు'' అన్న టైపుకొచ్చేశారట. ఈలోగా ఒక వాస్తు విద్వాన్‌గారు ఏదో కార్యక్రమంలో ఈయన్ని చూసి నడుం నొప్పి గురించి విని ''ఒరే అబ్బాయ్! నువ్వు ఉంటున్న ఇంటి వాస్తు అంత బాగాలేదు. అందుకే నీకీ నడుం నొప్పి తగ్గడం లేదు. అయితే దీనికి పెద్ద రెమెడీ ఏమీ అక్కర్లేదు. ఒక నాలుగు నిమ్మకాయలు ఎర్రగుడ్డలో చుట్టి ఇంటిచుట్టూ త్రిప్పి రాత్రి పన్నెండు గంటలకి మీ ఇంటికి వందగజాల దూరంలో

గొయ్యి తీసి పాతెయ్యి'' అన్నారుట.

ఇన్ని రకాల మందులు వాడినా తగ్గని నడుంనొప్పి నిమ్మకాయలు త్రిప్పితే పోతుందా అన్న ఆలోచన వచ్చినా కానీ ఏమో ఏ డిక్కీలో ఏ బాంబుందో చేసి చూద్దామని డిసైడైపోయారట.

సరే ఇంకేముంది. రాత్రి పన్నెండు గంటలకి నిమ్మకాయలు ఇంటి చుట్టూ త్రిప్పి ఒక్క సెంటీ మీటర్ అటూ ఇటూ కాకుండా వంద గజాల దూరం కొలిచి గొయ్యి తీసి పాతిపెట్టాక ఆ కంగారులో మంచి నిద్రలో ఉన్న ఊరకుక్క తోక తొక్కేసరికి అది కాస్తా లేచి జెట్ బాంబర్‌లా అరుస్తూ మీద పడిందిట. దాన్ని తప్పించుకునేందుకు మూర్తిగారు మిగిలిన 80 గజాల దూరం ఒక్క అంగలో ఎగిరి ఇంట్లో పడ్డారుట గజగజా వణుకుతూ.

పది నిముషాల తర్వాత తేరుకుని చూసేసరికి నడుం నొప్పి మటుమాయం.

ఇంకేముంది మూర్తిగారు వాస్తు విద్వాన్‌గారికి దాసోహం.

ఇక పళ్ళు పుచ్చినా, వంటికి ఎలర్జీ వచ్చినా, వంటలో పాళ్ళు తక్కువైనా, పెద్దాడికి ఎంసెట్ సీట్ రాకపోయినా, చిన్నాడు టెన్త్ ఫెయిలైనా అన్నింటికీ ఒకటే మంత్రం- గ్రహశాంతులూ-గృహ శాంతులూనూ.

మూర్తిగారి భార్య నిజంగా పతివ్రతామతల్లి. కనబడితే కాళ్లకి మ్రొక్కి పునర్జన్మ లేకుండా చేసుకుందును కానీ ఎప్పుడూ చూడలేదు.

ఎంత ఓర్పు లేకపోతే ఈ చాదస్తపు మొగుడితో కాపురం వెలగబెడుతుందో.

సరే ప్రస్తుతంలోకి వస్తే...

రెండు రోజుల క్రితం మూర్తిగారు అర్జెంట్ ఫైల్ పట్టుకురమ్మని ఫోన్ చేస్తే పట్టుకువెళ్లేసరికి మూర్తిగారూ, పిల్లలు, పతివ్రతామతల్లీ తలో కుర్చీలో ఏదో జరగరాని ఘోరం జరిగినట్టు దిగాలుగా కూర్చుని ఉన్నారు. స్వాగతాలూ, సత్కారాలూ ఎలాగూ లేవు కానీ కనీసం నా అజ అయినా పట్టించుకోని మూర్తిగారిని చూసి ఏమయిందా అని అడిగాను కదా- మూర్తిగారు మొన్ననే ఎంతో చాదస్తంగా కట్టించిన ఇల్లుని హైదరాబాద్ నుంచి ఎవరో గురువుగారు వస్తే చూపించారుట.

ఆయన ఇల్లంతా తిరిగి నోటమాట రాకుండా కూర్చుండిపోయారుట.

మూర్తిగారు ఆయనకి లిమ్కా త్రాగించి ఏంటలా అయిపోయారని అడిగితే ''అసలు ఈ ఇంటికి ప్లాన్ ఎవరు గీసారయ్యా? ఈ గుమ్మం లోంచి నడిస్తే 108 రోజుల్లో నీ మరణం ఖాయం'' అన్నారుట.

ఆయన రెమెడీ కూడా చెప్పకుండా వెళ్లిపోవడంతో వీళ్లంతా ఇప్పుడే సంతాపసభ పెట్టేసి తర్జన భర్జన పడుతున్నారు.

నేను సంతకాలు చేయించుకుని బ్యాంక్‌కి వచ్చేశాను.

వేరే చోటుకి వెళ్తే రోజా నూటికి 108సార్లు ప్రదక్షిణ చేస్తే కొంత ఫలితం ఉంటుందని, కానీ గుమ్మం మాత్రం ఉపయోగించకూడదని చెప్పారుట. అందుకని బాల్కనీలోంచి నిచ్చెన వేసుకుని దిగుతున్నానని ఆయనే చెప్పారు.

నేను నోరెళ్లబెట్టినా నా సజెషన్ అడగలేదు కనుక విని ఊరుకున్నాను.

ఈలోగా ఇవాళ ఉదయమే మా కొలీగ్ సూర్యనారాయణ ఫోన్- మూర్తిగారిని హాస్పిటల్‌లో చేర్పించారుట.



వెళ్దాం రమ్మని. కంగారుపడుతూ వెళ్లి చూద్దును కదా ఒళ్లంతా ఫుల్ బ్యాండేజీతో మంచం మీద మూర్తిగారు.

నేను అడక్కుండానే ఆవిడ విషయం అంతా చెప్పేశారు.

అసలే నూతి చుట్టూ ప్రదక్షిణలు చేసి చేసి పిక్కలు పట్టేశాయో ఏమో సగం నిచ్చెన మెట్లు దిగుతూ ''ఏవోయ్ భార్యామణీ! నా కళ్లజోడు బ్యాగ్‌లో పెట్టావా?'' అని పైకి చూస్తూ కాలు నిచ్చెన మెట్టు మీద కాకుండా గాలిలో వేసారు. దానితో చెట్టంత మనిషీ నిచ్చెన మీద నుంచి పడి బుర్ర పగిలిందట.

కాళ్ళూ చేతులూ చిన్నచిన్నగా విరిగాయిట. కనీసం నలభై రోజులు మంచం మీద ఉండాలిట.

ఇప్పుడు ఊళ్ళో ఎవరినోట విన్నా ఆయన మాటే.

తెలియనివాళ్ళు కూడా వచ్చి స్పృహలో లేని ఆయన్ని దర్శించి, నిచ్చెన మీదనించి క్రిందపడ్డ వైనాన్ని కథలు కథలుగా చెప్పుకుని తరిస్తున్నారు. అయితే ఆయనకున్న వేపకాయంత వెర్రిని డాక్టర్లు మందులతో నయం చేయలేరు కనుక స్పృహలోకొస్తే కానీ తెలియదు అది తగ్గిందో, లేక హాస్పిటల్లో బెడ్ దిశ మార్చమంటాడో మరి.

కొసమెరుపు: మొదటిసారి మూర్తిగారి నడుం నొప్పి ఎలా తగ్గిందో ఆయన గమనించలేదు కానీ నేను కనిపెట్టేశాను.

## నమ్మకం

**చాలాకాలంపాటు మీడియాకి దూరంగా ఉన్న ప్రీతీజింతా ప్రశాంతంగా కనిపిస్తోంది. పబ్లిసిటీ అవసరం లేదా అని అడిగితే నవ్వుతూ కావాలనే చెబుతోంది. 'మీడియా, ప్రజలే సినీరంగాన్ని శాసిస్తారు. వారికి దొరక్కుండా వెళ్లిపోవడం అనేది సాధ్యంకాదు. నేనెంతో బాలెన్స్‌గా ఉంటాను. నా ఎమోషన్స్‌ని నేను అదుపులో పెట్టుకోగలను' అంటోంది ప్రీతీ. 'ఎవరితోనైనా క్లోజ్‌గా తిరిగే ప్రీతికి మిత్రులతో పాటు శత్రువులు కూడా ఉన్నారు. వారే రూమర్స్‌ని పుట్టించి గాలికంటే వేగంగా వ్యాపింపచేస్తున్నారు. నాపై నాకు నమ్మకం ఉంది' అని చెప్పే ప్రీతీజింతా ప్రవర్తనలో ఎన్నో మార్పులు కన్పిస్తున్నాయి.**

అర్ధరాత్రి ఆబోతులాంటి కుక్క మీద పడి పిక్క పట్టుకోబోతే ఒక్క అంగలో పరుగెత్తి ఇంట్లో పడితే ఆ ట్రీట్‌మెంట్‌తో బెణికిన నడుము సరి అయిందటండీ!

ఆ సంగతి తెలియని మూర్తిగారు క్రిందపడి పాపం! బుర్ర పగులగొట్టుకున్నారు. ✤

**(కామెడీ కథ హాస్యం కోసం రాసిందే తప్ప ఎవరి నమ్మకాలనీ అపహాస్యం చెయ్యడం నా ఉద్దేశ్యం కాదని మనవి)**